క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా శనివారం పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరి పుదుపేటలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో, అనంతరం వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నగరి కేవీపీఆర్ పేటలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వేడుకగా మహాలక్ష్మికి పూజలు



నింద్ర : హోమ పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్‌పాళెంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భాద్రపద పౌర్ణమి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. లక్ష్మీ నారాయణ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజయపురంలో వర్షం

విజయపురం (నగరి) : విజయపురం మండలంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

సులభ రీతిలో బోధన సాగాలి

విజయపురం (నగరి) : విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా బోధన సాగాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. బోధన ఎలా ఉంది, మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉంటోందా అని ఆరా తీశారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి : మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నగరి : మండలంలోని సత్రవాడ దళితవాడలో సారా విక్రయిస్తున్న ఎస్.జయమ్మ (62)ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీలో సారా విక్రయిస్తున్న జయమ్మను అరెస్టు చేసి, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, బాలముని, విజయకుమార్, పీసీలు హిదయతుల్లా, కార్తీక్, భరత్ పాల్గొన్నారు.

నేడు గోపిశెట్టిపల్లిలో గడప గడపకు

కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గోపిశెట్టిపల్లి పంచాయతీలోని ఈదువారిపల్లి గ్రామంలో ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

ఘనంగా గరుడ సేవ



వెదురుకుప్పం: మండలంలోని చిన్న కొమరగుంటలో ఉన్న పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారు గరుడ వాహనం భక్తులను కటాక్షించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. సుంగధపరిమళాలు వెదజల్లే పుష్పాలతో స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహంపై స్వామి వారి ఉత్సవర్లను వేంచేపు చేసి అలంకరించారు. మేళతాళాల నడుమ గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వాహనదారులకు ఇంధనం

అట్టహాసంగా వైఎస్సార్ వాహన మిత్ర పథకం

- జిల్లాలో 11,864 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.11,86,40,000 జమ
- ఆటో నడిపిన మంత్రి ఆర్కే రోజా
- ఈ పథకం వరం : లబ్ధిదారులు



మెగా చెక్కును అందజేస్తున్న టూరిజంశాఖ మంత్రి ఆర్కే.రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జేసీ .బాలాజీ

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి ఆర్కే.రోజా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా విజయవాడ నుంచి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. ఆయన ప్రసంగాన్ని స్థానిక ఆటో లబ్ధిదారులు వర్చువల్ పద్ధతిలో వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరుసగా ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో ఐదు విడతల ద్వారా రూ.1,301 కోట్లను వాహనదారులకు జమచేసినట్టు వెల్లడించారు. జేసీ డీకే.బాలాజీ మాట్లాడుతూ వాహన ఇన్సూరెన్స్, రిపేర్ ఖర్చుల నిమిత్తం ఏడాదికి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. తిరుపతి జిల్లాలో మొత్తం 11,864 మందిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించి వారి ఖాతాల్లోకి రూ.11,86,40,000 జమ చేసినట్టు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పలువురు ఆటోవాలాలు మంత్రితో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తిచూపారు. రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ బసిరెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి సీతారామిరెడ్డి, గూడూరు ఆర్టీఓ ఆదినారాయణ, తిరుపతి డివిజన్ ఎంవీఐలు కుసుమ, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, పుత్తూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆటో నడుపుతున్న మంత్రి ఆర్కే రోజా

వాహన మిత్ర ఓ వరం



మహిళలు కూడా ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో వరుసగా ఐదో విడత వాహనమిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇవ్వడం ఎంతో ప్రయోజనంగా భావిస్తున్నాం. సీఎంకు రుణపడి ఉంటాం. -వాణి, ఆటో డ్రైవర్

పుత్తూరులో అభివృద్ధి పరుగులు

- సుమారు రూ.200 కోట్ల నిధులతో పనులు
- పలు పనులు ప్రారంభోత్సవాలకు సిద్ధం
మున్సిపల్ సమావేశంలో చైర్మన్ హరి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో ఒక్క పుత్తూరులోనే సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ వైఎస్సార్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ హరి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.25.24 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని వివరించారు. ఇందులో రూ.7.6 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల, రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్క్, రూ.25 లక్షలతో ద్రౌపదీదేవి ఆలయ రాజగోపురం పనులు పూర్తి చేసి మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.2 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణం, రూ.1.85 కోట్లతో షాదీ మహల్, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతూ ప్రారంభోత్సవాలకు పోటీ పడుతున్నాయని వివరించారు. ఇటీవలే గేట్ పుత్తూరులో రూ.36 లక్షలతో కమ్యూటీని హాలు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. అదేచోట రూ.2 కోట్లతో మరో పార్కును నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇన్ని అభివృద్ధి పనులు జరుగుతుంటే అభివృద్ధి ఎక్కడ అంటూ మాట్లాడే టీడీపీ నాయకులకు కళ్లు ఉన్నట్టా? లేనట్టా? అంటూ ప్రశ్నించారు. అనంతరం పలు ఆమోదాలను కౌన్సిల్ ఆమోదించింది.

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు

- కార్వేటినగరం మెయిన్ రోడ్డు నుంచి లక్ష్మీనగర్ వరకు రూ.6.53 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- వెంకటేశ్వర ఆస్పత్రి సమీప రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ.8.18 లక్షలతో డ్రైనేజీ
- సీఎస్ బాబు స్ట్రీట్‌లో రూ.3.26 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- రెండవ వార్డు తిమ్మాపురంలో రూ.4.31 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- శ్మశాన వాటికలో రూ.2.19 లక్షలతో మొక్కల పెంపకం

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రెడీ

'ఎనీ టైమ్, ఎనీ ప్లేస్!.. నువ్వు డిసైడ్ చేసినా సరే, మమ్మల్ని డిసైడ్ చేయమన్నా సరే!.. అభివృద్ధిపై బహిరంగ చర్చకు మేము రెడీ, నువ్వు రెడీనా' అంటూ నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌కు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి సవాల్ విసిరారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైకు దొరికితే చాలు అభివృద్ధి జరగలేదంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తే సరిపోదని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలన్నారు. అభివృద్ధిని చూస్తే కళ్లు బైర్లుకమ్ముతాయని పేర్కొన్నారు.

క్యారెక్టర్ లెస్ ఫెలో భాను

మంత్రి ఆర్కే రోజాను సభ్యసమాజం తలదించుకొనేలా మాట్లాడిన తీరు టీడీపీ నేత గాలి భానుప్రకాష్ వరస్ట్ క్యారెక్టర్‌ను తెలియజేస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ భాను ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారని, జైలుకు వెళ్లక తప్పదన్నారు. మంత్రి రోజాకు ఏ విధంగాను పోటీకి సరితూగలేమని మానసిక ఒత్తిడిలో అవాకులు, చవాకులు పేలడం మంచిది కాదని హితవుపలికారు. నీ మాటలను నియోజకవర్గంలోని మహిళలందరూ చీదరించుకొంటున్నారని, రానున్న ఎన్నికల్లో నీకు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లలో నలుగురు సమావేశానికి డుమ్మాకొట్టారంటే ప్రజాప్రతినిధులుగా వారు ఏమేరకు బాధ్యతగా పనిచేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

సన్మానం



తిరుపతిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పాఠశాలల్లో వ్యాస రచన పోటీలు

నగరి : శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయిబాబా సేవా సంస్థల విద్యా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8 నుంచి 10వ తరగతి వరకు ఆచార్యదేవోభవ అనే అంశంపై తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి నగరి కన్వీనర్ లాయర్ మురళీధర్, తడుకుపేట సమితి కన్వీనర్ రమణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల స్థాయిలోను పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రాంతీయ స్థాయి పోటీల ఫలితాలు అక్టోబర్ 15వ తేదీన, జిల్లా స్థాయి ఫలితాలు అక్టోబర్ 25వ తేదీన, రాష్ట్ర స్థాయి ఫలితాలు నవంబరు 5వ తేదీన ప్రకటిస్తామన్నారు.

గాలి భానుప్రకాష్‌ను అరెస్ట్ చేయాలి



పుత్తూరు: పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న సర్పంచ్ మంజుల

పుత్తూరు రూరల్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను వ్యక్తిగతంగా, అసభ్యపదజాలంతో దూషించిన నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ వడమాలపేట వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కదిరి మంగళం సర్పంచ్ మంజుల, ఇతర మహిళా సర్పంచులు భానును కఠినంగా శిక్షించాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎదుట బైఠాయించారు. మంజుల మాట్లాడుతూ చంద్రబాబు పేరిట నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్ బాధ్యతాయుత పదవిలో ఉన్న మంత్రి రోజాను ఉద్దేశపూర్వకంగా దూషించిన మాటలు సభ్యసమాజం తలదించుకొనేలా ఉన్నాయని అన్నారు. మహిళా ప్రజాప్రతినిది అన్న గౌరవం లేకుండా అసభ్యంగా మాట్లాడిన అతన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు అంజమ్మ, శ్రీవిద్య, మునెమ్మ, కమల, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సుధీర్‌రెడ్డి, నందయ్య, యాదవేంద్రరెడ్డి, కరుణాకర్ చౌదరి, చంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాను ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలి



నింద్ర: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నింద్ర: తెలుగుదేశం నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కోఆప్షన్ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ మంత్రి రోజాపై భాను అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటికొచ్చినట్లు మాట్లాడాన్ని ఖండించారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆమె నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నారని, నియోజకవర్గంలో తిరిగితే కళ్లకు కనిపిస్తుందని తెలిపారు. మరోసారి నోరు జారితే నియోజకవర్గంలో తిరగకుండా తగిన రీతిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. అనంతరం భానుప్రకాష్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీపీ దీప, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామోదరం, నాయకులు రామచంద్ర, మురళీరాజు, సంపత్, మునిరాజ్, సత్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి పూజలు



ఎస్సార్‌పురం: పూజల్లో పాల్గొన్న భక్తులు



పాలసముద్రం: స్వామివారికి దీపారాధన

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా గరుడ సేవను ఆలయ ట్రస్టీ కేఎస్ శ్రీధర్, వా సు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేయించారు. తిరు పతి నగరానికి చెందిన ఉభయదారులు శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులకు దర్శనం కల్పించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. మేనేజర్ వెంకటేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మలింగేశ్వరుడికి పౌర్ణమి పూజలు

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలోని పల్లేరుకాయల కోనలో వెలసిన ఆత్మలింగేశ్వర స్వామికి పౌర్ణమి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున సుప్రబాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త మోహన్‌నాయుడు, ఎస్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలగురునాధీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని రాచపాల్యం బాలగురునాధీశ్వరస్వామికి శుక్రవారం పౌర్ణమి పూజలు చేశారు. ఉదయం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, నెయ్యి, తేనెతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం గణపతి హోమం, నవగ్రహ హోమం, యాగశాల పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండ ల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

నగరి

నగరి మండలం	సుదర్శనంనాయుడు
నగరి మున్సిపాలిటీ	అయ్యప్పన్
పుత్తూరు రూరల్	గోవిందస్వామిరెడ్డి
పుత్తూరు మున్సిపాలిటీ	శంకర్
వడమాలపేట	సుబ్రమణ్యంరెడ్డి
విజయపురం	గోపినాథ్
నింద్ర	వేణుగోపాల్‌రాజు

జీడీనెల్లూరు

పెనుమూరు	విజయ్‌కుమార్‌రెడ్డి
కార్వేటినగరం	శేఖర్‌రాజు
వెదురుకుప్పం	పద్మనాభరెడ్డి
పాలసముద్రం	తులసీయాదవ్
జీడీనెల్లూరు	పూర్ణచంద్రారెడ్డి
ఎస్సార్‌పురం	మణి

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలతారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ హేమలతారెడ్డి అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. తహసీల్దార్ కళావతి మాట్లాడుతూ అసైన్డ్ గుర్తించి భూములు లేని పేదలకు యాజమాన్య హక్కు పత్రాలు అందిస్తామని, దళారులను నమ్మి మోసపోకండని తెలిపారు. మండల పశువైద్యాధికారి పార్థీభన్ మాట్లాడుతూ జగనన్న పాలువెల్లువ కార్యక్రమం ద్వారా అమూల్ డెయిరీకి పాలు సరఫరా చేస్తే ప్రతి లీటరుకు రూ.5 అదనంగా వస్తుందన్నారు. అంతే కాకుండా 10 శాతం రాయితీపై పాడి రైతులకు రూ.50 వేలు రుణసౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ఏపీఎం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు ద్వారా రూ.24.92 లక్షలు రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విదేశీ జ్ఞానేంద్రరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు యశోదారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష



చింతలపట్టెడ రాజవీధిలో పల్స్ చెక్ చేస్తున్న ఏఎన్ఎం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని జెడ్పీ హైస్కూల్లో శనివారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సంబంధించి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సురక్షను జయప్రదం చేయాలి

పాలసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్ కుమార్, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. వనదుర్గాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నేటి నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొత్తం 11,312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 3,015 మందికి టోకెన్లు జారీచేసినట్లు చెప్పారు. షెడ్యూలు ప్రకారం నేడు ఎగువ వనదుర్గాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు ఉంటుందని చెప్పారు. 3న జెడ్పీ హైస్కూల్ కేజే పురం , 4న రైతు భరోసాకేంద్రం ఎస్‌కేఆర్ పురం, 5న జెడ్పీ హైస్కూల్ వీఆర్ కుప్పం, 6న ఎంపీయూపీ స్కూల్ ఆముదాల, 7న ఆర్బీకే బాలక్రిష్ణాపురం, 9న ఎంపీయూపీ నరసింహపురం, 10న జెడ్పీ హైస్కూల్ తిరుమళరాజుపురంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్

నగరి మున్సిపాలిటీలో..

నగరి : ఇంటింటి సర్వేచేసి ప్రజల ఆరోగ్యవివరాలు సేకరించిన వైద్య సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు అనారోగ్యంతో ఉన్నవారికి ఉచితంగా చికిత్స అందించి మందులు పంపిణీ చేసేందుకు శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నారు. కాకవేడు, కోళంమిట్ట, టీఆర్ కండ్రిగ, కీళపట్టు, నెత్తం కండ్రిగ, ఇందిరానగర్, పుదుపేట నార్త్, నగరి వెస్ట్, ఎంపీడీవో ఆఫీస్ రోడ్, చింతలపట్టెడ సచివాలయ పరిధిలో గుర్తించిన వారికి నగరి పట్టణం పళ్లిపట్టురోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద శిబిరం ఏర్పాటు చేయనున్నారు. మంత్రి ఆర్కేరోజా ఈ శిబిరాన్ని ప్రారంభించనున్నారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని చికిత్స అందించనున్నారు. శుక్రవారం కూడా వివరాల సేకరణలో వైద్యసిబ్బంది నిమగ్నమయ్యారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): అనునిత్యం ప్రజలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చంద్రగిరి నుంచి కుప్పం పారిపోయారని, ఏకంగా మంగళగిరి అనే పదం తిరగని లోకే మంగళగిరిలో ఓడిపోయారని ఎద్దేవా చేశారు. వందగొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకొరిగినట్లు, పదుల సంఖ్యల కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దొరికిపోయారని ఎద్దేవా చేశారు. జైలుకు వెళ్లిన చంద్రబాబును వెనకేసుకొస్తున్న పచ్చబ్యాచ్, ప్రజల కోసం పనిచేసే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై విమర్శలకు దిగడం సరికాదని హెచ్చరించారు. ఏఎంసీ చైర్మన్ బండి కమాలకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోధారెడ్డి, కృష్ణారెడ్డి, దాము, నవీన్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీ జమున, మండల మహిళా అధ్యక్షురాలు మీనా పాల్గొన్నారు.